చలివేంద్రం ఏర్పాటు

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి- చింతపల్లి: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా తమ తండ్రి, టీవీ5 మాజీ రిపోర్టర్ పెదిరెడ్ల నాగేశ్వరరావు (కోమో) జ్ఞాపకార్థం ఆయన కుమారులు, గౌతమ్, జస్వంత్, వారి కుటుంబ సభ్యులు, స్థానికులతో కలిసి మండల కేంద్రంలోని పైడిమాంబ దుకాణ సముదాయం సమీపంలో మంగళవారం చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు కుమారులు మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సీజన్ పొడుగునా చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. ప్రజలకు సేవ చేయడం, ఇతరకు సహాయపడాలని తమ తండ్రి చూపిన మార్గంలోనే ఆయన గుర్తుగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానికులతోపాటు మండలకేంద్రానికి వివిధ పనులపై వచ్చేవారు వినియోగించుకోవాలని కోరారు.

'ఉపాధి' ప్రగతిలో అల్లూరి జిల్లా ముందంజ

- పలు అంశాలలో రాష్ట్రంలోనే మొదటి స్థానం
- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : ఉపాధి హమీ పథకం అమలులో 2024-25 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి, ఉపాధి కల్పన, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో అద్భుత విజయాలను సాధించి, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తూ, అనేక రంగాల్లో రాష్ట్ర స్థాయిలో అల్లూరి జిల్లా ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు....

ఉపాధి కల్పనలో అగ్రగామిగా...

అత్యధికంగా 69,062 కుటుంబాలకు 100 రోజుల ఉపాధిని అందించడం ద్వారా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో అల్లూరి జిల్లా నిలిచిందని,ప్రతి కూలీకి సగటు 74.85 రోజుల పని కల్పనతో రాష్ట్రంలో మొదటిస్థానం, 10939 ఎకరాలలో హార్టికల్చర్ సాగు చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని వెల్లడించారు.

నిర్దేశించిన 148 లక్షల పనిదినాల లక్ష్యాన్ని అధిగమించి, 161 లక్షల పని దినాలను కల్పించడం ద్వారా రాష్ట్రంలోనే అల్లూరి జిల్లా మూడవ స్థానంలో నిలిచిందన్నారు. కూలీలకు సగటు రోజువారీ వేతనంగా రూ. 263.19 చెల్లించి, రాష్ట్రంలో 8వ స్థానం సాధించిందన్నారు. . ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 37.32 కోట్లు ఖర్చు పెట్టగా అందులో వేతనాలు రూపంలో రూ.421.94 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్‌కు రూ.301.30 కోట్లు అడ్మిన్ కింద రూ.14.08 కోట్లు ఖర్చు చేశామన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతా పనులలో పురోగతి

పంట సంజీవిని పనులను 2451 పూర్తి చేసి, రాష్ట్రంలో మొదటి స్థానాన్ని, 13609 ఇంకుడు గుంతలను నిర్మించడం ద్వారా రాష్ట్రంలో మొదటి స్థానాన్ని సాధించిందని కలెక్టర్ వెల్లడించారు.. 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా 55 పశువుల షెడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని, రూ. 250 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు మరియు డబ్ల్యూబిఎం రోడ్లను నిర్మించామన్నారు.

2025-26 పనుల ప్రణాళిక

పశువుల తాగే నీటి తొట్టెలు 500 పూర్తి చేయాలని, వ్యవసాయ భూముల సంరక్షణకు అత్యంత కీలకమైన పంట సంజీవని మొదటి మూడు నెలలలో 8000 పూర్తి చెయ్యాలని ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఉపాధి కూలీలకు సగటు వేతనం రూ.307 వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, కాలువల పనులు, చెరువుల పూడికతీత పనులు మొదలగు ప్రభుత్వ ప్రాధాన్యతా పనులను మొదటి మూడునెలల్లోనే పూర్తిచేసే విధంగా పకడ్బందీ ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- డిఆర్ఎం కార్యాలయం వద్ద కెకె.లైన్ రైల్వే కాంట్రాక్టు కార్మికుల నిరసన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎటువంటి నోటీసూ ఇవ్వకుండా కాంట్రాక్టర్ అక్రమంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ అరకు కెకె.లైన్‌లో పనిచేస్తున్న 56 మంది గిరిజన కార్మికులు మంగళవారం విశాఖలోని వాల్తేర్ డివిజన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, రైల్వే బోర్డు ప్రకటించిన జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని కాంట్రాక్టర్‌ను అడిగిన పట్టించుకోకపోవడంతో రీజినల్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని కార్మికులను కాంట్రాక్టర్ విధుల నుంచి తొలగించి బెదిరింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు. గిరిజనులతో కాంట్రాక్టర్ వెట్టి చాకిరి చేయించడమే కాకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. తొలగించిన 56 మంది గిరిజన పెట్రోలింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లించి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైల్వే ఒఎస్‌డికి వినతి పత్రం అందించారు. రీజినల్ లేబర్ ఆఫీస్‌కు వెళ్లి కమిషనర్ కలిసి కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అరుకు, బొర్రా, టైడ, శివలింగాపురం స్టేషన్ నుంచి యూనియన్ నాయకులు కె.సన్యాసిరావు, గిరిజన సంఘం నాయకులు చిట్టిబాబు, దామోదర్, కృష్ణ, వెంకటరమణ, చిన్న పాల్గొన్నారు.

డిఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న కెకె లైన్ కార్మికులు

జాగిలాలతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎఒబిలో ముమ్మరంగా తనిఖీలు

- భయాందోళనలో గిరిజనులు

ప్రజాశక్తి-సీలేరు

పోలీసు లక్ష్యంగా చేసుకొని ప్రణాళిక ప్రకారం మావోయిస్టు భారీ విధ్వంసానికి పాల్పడతారని భావిస్తున్న పోలీసులు ఎటువంటి నష్టం కలగకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో అత్యాధునిక ఆయుధాలతో కేంద్ర పోలీసు బలగాలు తనిఖీలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. పోలీసు ఆపరేషన్ నిర్వహించే ముందే బలగాలకు ఎటువంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు వహిస్తున్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో వరస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులకు పెద్ద ఎత్తున నష్టం జరగింది. మరోపక్క పోలీస్ ఆపరేషన్ కఠిన తరంగా ఉండడంతో దళాల్లో కొందరు మావోయిస్టులు పోలీసుల ముందు సరెండర్ అవుతున్నారు. పదుల సంఖ్యలో మావోయిస్టులు ఉన్నతాధికారుల ముందు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. ఒకపక్క ఎన్‌కౌంటర్లు, మరోపక్క లొంగుబాట్లుతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సమయంలో మావోయిస్టులు రహదారుల్లో మందు పాతరలు అమర్చి ఉంటారని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. దీంతో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు మారుమూల కట్ ఆఫ్ ఏరియా రహదారులలో బాంబు స్క్వాడ్ బృందాలు, అత్యాధునిక శిక్షణ కలిగిన జాగిలాలతో తనిఖీలు చేస్తున్నారు. నాలుగైదు రోజులు నుంచి ఎఒబిలో అధిక సంఖ్యలో పోలీసులతో కూంబింగ్ ఆపరేషన్ చేస్తున్నారు. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియక సరిహద్దు గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చడమే లక్ష్యం

- రూ.50.25 లక్షలతో జిల్లాలో 150 తాగునీటి తొట్టెల నిర్మాణం
- కుమ్మరిపుట్టులో శంకుస్థాపన చేసిన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

నీటితొట్టికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రూ.50.25లక్షల వ్యయంతో పశువులకు 150 తాగునీటి తొట్టెలను నిర్మిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ అన్నారు. మంగళవారం కుమ్మరిపుట్టు గ్రామం వద్ద పశువుల మంచినీటి తొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో పశువులకు తాగునీటి ఎద్దడి రాకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వ సంకల్పించిందని, అందులో జిల్లాకు 150 నీటి తొట్టెలను మంజూరు చేయగా, పాడేరు మండలంలో ఆరు మంచి నీటి తొట్టెలను నిర్మిస్తున్నామన్నారు. ఒక్కొక్క మంచినీటి తొట్టెకు రూ. రూ.33,550ల వ్యయం చేస్తామన్నారు. తాగునీటి తొట్టెల నిర్మాణాలను వేగవంతం చేసి, పూర్తి చేయాలని ఉపాధిహామీ పథకం అధికారులను ఆదేశించారు. నిర్మాణాలలో తగిన నాణ్యతలు పాటించాలని, పశువులు నీళ్లు తాగడానికి అనువుగా ఉండే విధంగా నిర్మాణాలు జరగాలన్నారు. కార్యక్రమంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, డ్వామా పీడీ డాక్టర్ విద్యాసాగర్, ఎంపిటిసి వరలక్ష్మి, స్థానిక నేతలు బొర్రా నాగరాజు, బొర్రా విజయరాణి, ఉపాధి ఎపిడి శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు.

పెదబయలులో...

పెదబయలు :మూగజీవాల దాహార్తిని తీర్చాలని సిఎం చంద్రబాబు, ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో అడుగులపుట్టు గ్రామపంచాయతీలో లక్కిపుట్టులో తాగునీటి తొట్టె నిర్మాణ పనులకు సర్పంచ్ తరపున ఆమె భర్త కొర్ర నూకరాజు, ఎంపిడిఒ ఎల్, పూర్ణయ్య శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంపిడిఒ మాట్లాడు తూ, వారం రోజుల్లో తొట్టె నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేనున్నట్లు తెలిపారు. వెటర్నరీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి : మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ దిగువ బూడి గ్రామంలో పశువులకు తాగునీటి కుండీల నిర్మాణ పనులకు మంగళవారం స్థానిక జెడ్‌పిటిసి దీసరి. గంగరాజు, ఎంపిపి శెట్టి .నీలవేణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం నీటి కుండీల నిర్మాణానికి నిదులు మంజూరు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి టి.మిథుల, సర్పంచ్ మజ్జి. అప్పారావు జనసేన మండల ప్రతినిధి సిహెచ్ మురళి, ఉపాధి ఎపిఒ కె.అర్జున్ పాల్గొన్నారు.

అనంతగిరిలో నీటి కుండీకి శంకుస్థాపన చేపడుతున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

కోర్టు సినిమా హీరో రోషన్‌కు స్వాగతం పలుకుతున్న కూనవరం గ్రామస్తులు

కోర్ట్ హీరో రోషన్‌కు స్వగ్రామంలో ఘన స్వాగతం

ప్రజాశక్తి -కూనవరం

కోర్ట్ సినిమా హీరో రోషన్ తన సొంత గ్రామానికి రావడంతో కూనవరం సందడి వాతావరణం నెలకొంది. గ్రామస్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కూనవరం గ్రామస్తుడు రషీద్ కుమారుడు రోషన్ హీరో అయ్యి పెద్ద విజయం సాధించడంతో తన విజయాన్ని మొదటి తన గ్రామస్తులతో జరుపుకున్నాడు. గ్రామస్తులందరూ కలిసి స్థానిక పాఠశాలలో ఆయన్ను సన్మానించారు. తమ గ్రామస్తుడు హీరో అయ్యి విజయం సాధించడం తమకు ఆనందంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

సిహెచ్‌డబ్ల్యులను ఆశా వర్కర్లుగా మార్చాలి

- తాజంగి పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యాన నిరసన
- 11న చలో కలెక్టరేట్‌కు తరలి రావాలని పిలుపు

తాజంగి పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు

ప్రజాశక్తి-చింతపల్లి: సిహెచ్‌డబ్ల్యులను ఆశ వర్కర్లుగా మార్చాలని సిఐటియు జిల్లా నాయకులు పాంగి ధనుంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని తాజంగి పిహెచ్‌సి వద్ద సిహెచ్‌డబ్ల్యులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆశ వర్కర్లతో సమానంగా సిహెచ్‌డబ్ల్యులు పనిచేస్తున్నారని, అయితే వేతనం, ఇతర ప్రయోజనాల్లో సిహెచ్‌డబ్ల్యులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. .సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు ఏళ్ళ తరబడి గ్రామాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్న సిహెచ్‌డబ్ల్యులకు తగిన ఫలితం లేకుండా ప్రభుత్వం చాకిరీ చేయించుకుంటోందని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రసూతి సెలవులు, ప్రమాద మరణాలకు మట్టిఖర్చులు ఇవ్వకపోవడం, ఇతరత్రా వ్యత్యాసాలను చూపడం సరికాదన్నారు. సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా మార్చి, కనీస వేతనాల అమలుతోపాటు వారికి కల్పించే అన్ని ప్రయోజనాలను సిహెచ్‌డబ్ల్యులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన తమ డిమాండ్‌ల సాధనకు సిహెచ్‌డబ్ల్యుల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 11న పాడేరు కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిహెచ్‌డబ్ల్యుల నేతలు సూర్యకుమారి, వరలక్ష్మి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

పశువుల నీళ్ల తొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన

విఆర్.పురం మండలం చొక్కనపల్లిలో శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సంతోష్

ప్రజాశక్తి-విఆర్.పురం

ఎన్ఆర్ఈజీఎస్ కింద పశువులకు నీళ్ల తొట్టెల నిర్మాణానికి మండలంలోని చొక్కనపల్లి గ్రామంలో మంగళవారం శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో పశువుల దాహాన్ని తీర్చడానికి ప్రభుత్వం ఉపాధి హామీ ద్వారా నీళ్ల తొట్టెలు ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఉపాధి హామీ కూలీలు మొబైల్ మానిటరింగ్ సిస్టం పద్ధతిని పాటించాలన్నారు. పనిలోకి వచ్చిన వెంటనే మొబైల్ ద్వారా ఫొటో తీసి పంపించాలని, నాలుగు గంటలు పని నడిచిన తర్వాత మొబైల్ మోనిటరింగ్ సిస్టం ఉపయోగించి వెళ్లాలని సూచించారు. ఫారం పాండ్ భూమి నాణ్యతను బట్టి ఒక క్యూబిక్ మీటర్‌కు రూ.300, చెరువులు పూడిక తీయడానికి ఒక క్యూబిక్ మీటర్‌కు రూ.280 చొప్పున కూలీలకు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొడిశల దుర్గారావు, వార్డ్ సభ్యులు గొంది ధారయ్య, చొక్కనపల్లి పటేలు తోడంరాజు, గ్రామస్తులు ఆత్మకూరి కాంతారావు, సోడి చందర్రావు, పెట్ట ఏసుబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని నడింపాలెం పంచాయితీలో ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా పశువుల నీటి తొట్టెల నిర్మాణ పనులకు టిడిపి కూటమి నాయకులు పనసల రాము మంగళవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సుమర్ల సాంబశివరావు, జంపా వెంకటరమణ, జనసేన నాయకులు రమణమూర్తి, రాజుబాబు, కృష్ణ, మల్లుదొర, ఫీల్డ్ అసిస్టెంట్లు యస్.రత్నం, జె.ధార. టిఎ.రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొయ్యూరు మండలం నడింపాలెంలో భూమి పూజ చేస్తున్న దృశ్యం

డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

గోదావరి డెల్టాకు నీటి విడుదల పొడిగింపు

ప్రజాశక్తి-సీలేరు : సీలేరు కాంప్లెక్స్ నుంచి గోదావరి డెల్టా రబీ పంటకు నీటి విడుదల ఈనెల 7వ తేదీ వరకు పొడిగించినట్లు ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటకు డొంకరాయి జలాశయం స్పిల్ వే గేట్లు ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా 5000 వేల క్యూసెక్కులు, పోల్లూరు జలవిద్యుత్ కేంద్రం నుంచి 4300 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. డొంకరాయి జలాశయం నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 10 నుంచి మార్చి 31 వరకు ఇరిగేషన్ అధికారులు కోరిక మేరకు గోదావరి డెల్టాకి నీటి విడుదల చేయగా, రబీ పంటకు నీరు అవసరం అధికంగా ఉండడంతో ఈనెల 7 వరకు నీటి విడుదల కొనసాగించాలని వారు కోరారని తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి మార్చి 31 వరకు డొంకరాయి స్పిల్ వే గేట్లు ద్వారా 14.468 టీఎంసీలు నీటిని విడుదల చేసామని చీఫ్ ఇంజనీర్ పేర్కొన్నారు.

తొలిరోజున 93.93 శాతం పింఛన్ల పంపిణీ

ఆడారిమెట్టలో ఫించన్లను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పింఛను పథకాన్ని అర్హులైన లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. మంగళవారం పాడేరు మండలం, చింతలవీధి పంచాయతీ అడారిమెట్ట గ్రామంలో కలెక్టర్ స్వయంగా ఫించన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ కేటగిరీల లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటవ తేదీన పింఛన్లను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, దాని అమలుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. మొదటి రోజైన మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి జిల్లాలో .93 శాతం మందికి ఫించన్లు పంపిణీ పూర్తిచేశామన్నారు. జిల్లాలో మొత్తం 1,22,654 మంది లబ్ధిదారులకు రూ. 51,70,73,500 పింఛను సాయం అందజేయాల్సి ఉండగా, 1,15,203 మందికి రూ. 48,43,61,500లు పంపిణీ చేశామన్నారు.

అడారిమెట్ట గ్రామంలో వితంతు పింఛను తీసుకుంటున్న శ్రీలత అనే లబ్ధిదారు బిఇడి పూర్తి చేసి ఇంటికే పరిమితం కావడం, తోబుట్టువులు కూడా ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా ఉండటాన్ని గుర్తించిన కలెక్టర్ ఆశ్చర్యపోయారు.వారికి నైపుణ్య శిక్షణ అందిస్తామని, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసానిచ్చారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మాజీ ఎంపిటిసి జి. వరలక్ష్మి, మాజీ ఎంపిపి బొర్రా విజయ్ రాణి, వైస్ ప్రెసిడెంట్ టి. సూరిబాబు, చింతలవీధి సర్పంచ్ వంతాల సీతమ్మ, లగిశపల్లి సర్పంచ్ పార్వతమ్మ, డిఆర్‌డిఎ పిడి వి. మురళి, ఎపిఎం చిన్నరావు, డ్వామా ఎపిడి శ్రీనివాస నాయుడు, పాడేరు ఎంపిడిఒ తేజ రతన్ పాల్గొన్నారు.

సిల్వర్ ఓక్, కాఫీ తోటలు అగ్నికి ఆహుతి

ప్రజాశక్తి-సీలేరు : జీకే.వీధి మండలం వంచల పంచాయతీ చామగడ్డ గ్రామంలో మూడు ఎకరాల సిల్వర్ ఓక్, కాఫీలో అగ్నికి ఆహుతయ్యాయి. చామగడ్డ గ్రామానికి చెందిన చెదల శశికాంత్ ఆరు సంవత్సరాల కిందట మూడు ఎకరాల్లో సిల్వర్ ఓక్ మొక్కలు వేసి, అందులో గత ఏడాది కాఫీ మొక్కలు కూడా నాటారు. ఫలసాయం చేతికి వచ్చే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం ఉదయం 11 గంటలకు నిప్పు పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటనలో మూడు ఎకరాల్లో ఉన్న సిల్వర్ వోక్, కాఫీ మొక్కలు కాలి బూడిదయ్యాయి. దీంతో రైతు చదల శశికాంత్ కన్నీరు మున్నేరుగా వినిపిస్తున్నాడు. ఎంతో కష్టపడి మూడు ఎకరాల్లో సిల్వర్ ఓక్, కాఫీ మొక్కలు పెంచుకున్నాని, ఫలసాయం చేతికొచ్చే సమయానికి అగంతుకులు నిప్పు పెట్టడంతో కాలి బూడిదయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరు సంవత్సరాలు శ్రమించి పెట్టుబడి పెట్టి పెంచిన తోట అగ్నికి ఆహుతి కావడంతో ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నానని వాపోయారు. ప్రభుత్వమే తమను ఆర్థికంగా ఆదుకోవాలని రైతు శశికాంత్ వేడుకుంటున్నారు.

కాలిపోయిన సిల్వర్ ఓక్, కాఫీ మొక్కలు

జీతాలు రాక ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి- మోతుగూడెం

జిల్లాలోని వై.రామవరం మండలం దిగువ సీలేరు డొంకరాయి గ్రామంలో ఉన్న ఏపీ జెన్‌కో సంస్థలోని వివిధ విభాగాల్లో సుమారు 41మంది అభినయ ఎంటర్ప్రైజెస్ కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో పని చేస్తున్నారు. ఈ కార్మికులకు రెండు నెలలుగా జీతభత్యాలు ఇవ్వడం లేదు. సదరు కాంట్రాక్టర్‌ను జీతాలు ఇవ్వమని అడగగా ఏపీ జెన్‌కో వారు తనకు ఇంకా బిల్లులు ఇవ్వలేదని, అందువలన జీతాలు ఇవ్వడం లేదు సమాధానం చెబుతున్నారు. జెన్‌కో అధికారాలకు పలుమార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బాధిత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే కార్మికులకు జీతాలు చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు చింత రాంబాబు, రమణ బాబు డిమాండ్ చేశారు.

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను టీడీపీ మండల నాయకులు గణజాల తాతారావ్ మంగళవారం మారేడుబాక పంచాయతీ ఉర్లాకులపాడు గ్రామంలో రెండు బూత్‌లకు సంబందించిన పార్టీ నాయకులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జి కొచ్చా కాసులమ్మ, మాజీ జడ్పీటీసీ కోసూరి బుజ్జిచిన్నాలమ్మ, పార్టీ మహిళా నాయకులు రామిశెట్టి గంగ, పోలిశెట్టి సూర్యావతి, కోసూరి మల్లమ్మ, కాసులమ్మ, పార్వతి, కోసూరి సీతారత్నం, యూత్ నాయకులు కోసూరి లోవ వీరవెంకటరెడ్డి పాల్గొన్నారు.



టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

వ్యవసాయానుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధి లక్ష్యం

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్ కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. అన్ని రంగాల్లో జిల్లాలో ఉద్పాదకత పెరగాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, వ్యవసాయ, మత్స్యశాఖ, ఉద్యానవన శాఖ, మైక్రో ఇరిగేషన్, ఫుడ్ సేఫ్టీ, పశు సంవర్గక శాఖ, ఎంపిడిఓలు , సెరీకల్చర్, ఎస్ఎంఐ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సేంద్రీయ వ్యసాయాన్ని ప్రోత్సవించాలని సూచించారు. జిల్లాలో 104 చెక్ డ్యాంలు మరమ్మతులు చేసి, 5500 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. కాఫీ విస్తరణకు ముఖ్యమంత్రి ఆదేశించారు. రానున్న మూడేళ్లలో సేంద్రీయ వ్యవసాయ విస్తరణకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రిజర్వాయర్లలో మత్స్య సంపద పెంచడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు సమక్షంలో మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేయాలన్నారు. . మత్స్యకారుల సొసైటీలను ఆడిట్ చేయాలని ఎంపిడిఓలను ఆదేశించారు. 5 వేల ఎకరాల్లో సామలు, రాగులు పెంపకం చేపడుతున్నామన్నారు. ఈ ఏడాది 33 వేల ఎకరాలలో కాఫీ తోటల పెంపకానికి నీడతోటలు వేయాలన్నారు. 17,170 ఎకరాలలో ఉద్యానవన తోటలు, పండ్లతోటలు, కూరగాయలు సాగు చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. రంపచోడవరం డివిజన్ లో జీడిమామిడి, ఆయిల్ ఫామ్ తోటలు వేయాలన్నారు.

15 శాతం వృద్ధి సాధించడానికి ఏప్రిల్ 15న వర్క్‌షాపు నిర్వహించాలన్నారు. అన్ని మండలాల్లో 2 వేల ఎకరాల్లో డ్రిప్ ఇరిగేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఆర్గానిక్ సేద్యం చేస్తున్న ఎఫ్‌పిఒలకు ప్రభుత్వ ప్రోత్సహకాలు, రాయితీలు అందించాలని సూచించారు. కాఫీ, మిరియాల కంటే అధిక ఆదాయమిచ్చే మల్బరీ సాగును జిల్లాలో విస్తరించాలనిసూచించారు. . ఈ ఏడాది పాడేరు, రంపచోడవరం డివిజన్లలో రెండు వందల ఎకరాల్లో మల్బరీ సాగు పెంచేలా రైతులను చైతన్యవంతం చేయాన్నారు. కూన వరంలో 240, చింతూరు 160 ఎకరాల్లో టస్సార్ సాగు చేస్తున్నారని మరో 400 ఎకరాలల్లో టస్సార్ సాగు ను విస్తరించాలన్నారు. ఐటిడిఏ పరిధిలో పశు సంపద యూనిట్లు లబ్దిదారులకు అందించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. లబ్దిదారులకు డిసిసి మీటింగ్స్ యూనిట్లు మంజూరు పై చర్చించాలన్నారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో రూ.20 కోట్లతో చెక్‌డ్యాం మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. 7 వేల ఎకరాలకు సాగునీరందించే బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. రైతులకు ప్రయోజనం కలిగే విధంగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలలకు కాలం చెల్లిన ఆహార పదార్థాలు సరఫరా చేస్తే సరఫరా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మోద కొండమ్మ జాతరలో హోనిఖీ చేయాలని సూచించారు. తాగునీటి సమస్యలు ఏర్పడకుండా వేసవి కార్యచరరణ ప్రణాళిక సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. తాగునీటి వనరులు, చేతి పంపులు మరమ్మతులు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేస్తే సచివాలయ సిబ్బందిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. తాగునీరందించడానికి ఎంపిడిఒలు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో వర్చువల్‌గా పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడి ఏ పి ఓలు, డా. ఎం.జే. అభిషేక్ గౌడ, కట్టా సింహాచలం, అపూర్వ భరత్, ఎంపిడిఒలు, ప్రత్యక్షంగా జిల్లా వ్యవయాధికారి ఎస్‌బిఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్‌కుమార్ రావు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సిహెచ్.నరసింహులు, జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పారావు, మత్స్యశాఖ అధికారి శ్రీనివాస రావు, ఎస్ఎంఐడి. ఇ నాగేశ్వరరావు, సిపిఒ ఎస్ఎస్ఆర్‌కె పట్నాయక్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ జవహార్ కుమార్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి -అనంతగిరి : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని హోటల్స్, కిరాణా దుకాణాలు, ప్రభుత్వ. ప్రైవేటు రిసార్ట్స్, ఇతర చోట్ల పూర్తిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలని ఎంపిపిఒ ఎవివి.కుమార్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.మాణిక్యం పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యాపారసంస్థలు, ప్రభుత్వ. ప్రైవేటు రిసార్ట్స్‌ను ఆకస్మికంగా సందర్శించి, ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు నిర్వహించడంతోపాటు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్వర్వులు, ఆదేశాలను బేఖాతరు చేసి ఎవరైనా ప్లాస్టిక్‌ను వినియోగిస్తే తొలితప్పుగా రూ.2,500 జరిమానా విధిస్తామని, అప్పటికీ తీరుమారకపోతే, ఆయా వ్యాపారసంస్థలు, హోటల్స్ అనుమతులు రద్దుతోపాటు జప్తు చేస్తామని, నిబంధనల మేరకు కేసులు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ ప్లాస్టిక్ నిషేధం పూర్తిగా అమలులో ఉంటుందన్నారు.కార్యక్రమంలో ఆర్ఐలు పి శంకరరావు, జగ్గయ్యమ్మ, సెక్రటరీ సిఎస్ దేవా, విఆర్ఒ దేముడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏజెన్సీలో ఆదివాసీలకు పోస్టుల్లేకుండా...

ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్ అన్యాయం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లా షెడ్యూల్ ఆదివాసీ మహిళ ,శిశు సంక్షేమ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఆదివాసులకు ఒక పోస్టు కూడా కేటాయించకపోవడం తీవ్ర అన్యాయమని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మండిపడ్డారు. మంగళవారం అరకులోయలో విలేకరులతో మాట్లాడుతూ, మిషన్ వాత్సల్య పథకం కింద అల్లూరి .జిల్లా మహిళ, శిశు సంక్షేమ సాధికారత కార్యాలయం విడుదల చేసిన అన్ని పోస్టులను గిరిజనేతరులకు కేటాయించడం దుర్మార్గమని, ఆదివాసులకు తీవ్ర అన్యాయం చేసే నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా పిల్లల రక్షణ అధికారి విభాగంలో సోషల్ వర్కర్ ఒక పోస్టు, అవుట్ రీచ్ వర్కర్, ప్రత్యేక దత్తత ఏజెన్సీ (ఎస్ఎస్ఎ)విభాగంలో మేనేజర్, కోఆర్డినేటర్, పార్ట్‌టైం డాక్టర్ పోస్టులు ఒక్కొక్కటీ, ఆయా పోస్టులు మూడింటిని కాంట్రాక్టు పద్ధతిని నోటిఫికేషన్ జారీ చేయగా, వీటిల్లో ఒక్క పోస్టు కూడా ఎస్‌టిలకు కేటాయించలేదన్నారు.

అలాగే మిషన్ శక్తి ఆధ్వర్యంలో వన్‌స్టాప్ సెంటర్లో పని చేయుటకు మానసిక సామాజిక సలహాదారు(మహిళ), బహుళ ప్రయోజన సిబ్బంది / కుక్ (మహిళ) ఒక పోస్టు, సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్ (మహిళ) ఒక పోస్టును పూర్తిగా కాంట్రాక్ట్ పద్ధతిన నియమించేందుకు నోటిఫికేషన్ ఇవ్వగా, అందులోనూ ఒక్క పోస్టయినా ఆదివాసీలకు కేటాయించలేదన్నారు.ప్రస్తుతం జారీ చేసిన నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేసి, ఆయా విభాగాల్లో అన్ని పోస్టులను ఆదివాసీలతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషిచేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషిచేయాలని ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 1510వ రోజుకు చేరుకున్నాయి ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాలకు చెందిన ఐఎన్‌టియుసి కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని ఎన్నికల్లో చెప్పి అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేనలు నేడు మిన్నకుండిపోవడం దుర్మార్గమన్నారు. ఆరు నెలలుగా కార్మికులకు సరిగా వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

నేరాలు ఘోరాలు

180 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-పెందుర్తి : ఒడిశా నుండి నాసిక్ తరలిస్తున్న 180 కిలోల గంజాయిని పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఎసిపి పృథ్వీతేజ వివరాలు వెల్లడించారు. పెందుర్తి మండలం రాజయ్యపేట వద్ద పోలీసులు తనిఖీ చేపట్టగా మినీవ్యాన్‌లో 180 కిలో గంజాయిని తరలించడాన్ని గుర్తించారు. వ్యాన్‌లో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారు. గంజాయి తరలిస్తున్న మినీ వ్యాన్‌కు ముందు రెండు మోటార్ సైకిళ్లతో పైలట్‌లు వెళ్లడం విశేషమని ఎసిపి పేర్కొన్నారు.

సముద్రస్నానం చేస్తూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్‌లో స్నేహితులతో కలిసి సముద్ర స్నానం చేస్తున్న క్రమంలో ఊపిరాడక ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. అదే రోజు రాత్రి సుమారు 11 గంటలకు మృతుని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా గజపతినగరం మండలం, మరుపల్లి గ్రామం గెద్దవీధికి చెందిన గెద్ద పరదేశి (40), తన స్నేహితులు శ్రీను, సత్యనారాయణ, శంకర్, మణితో కలిసి రెండు మోటారు సైకిళ్లపై భీమిలి వచ్చారు. వీరంతా సాయంత్రం వేళ సముద్రంలో స్నానం చేస్తుండగా పరదేశి అయాసానికి గురై ఊపిరాడక పోవడంతో ఒడ్డుకు వచ్చాడు. గమనించిన స్నేహితులు వెంటనే ఒడ్డుకు వచ్చి సపర్యలు చేసి భీమిలిలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని అన్నయ్య నారాయణరావు ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ అమ్మోరు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మరుపల్లిలో పాల కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు కాపులుప్పాడ కంబాల చెరువులో చేపల వేటకు వెళ్లిన రెడ్డీలపాలెం గ్రామానికి చెందిన వై.సంతోష్ (36) ఊబిలో చిక్కుకుని మంగళవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. రెడ్డీల పాలెం గ్రామానికి చెందిన సంతోష్ మంగళవారం తెల్లవారు జామున కంబాలచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో నీరు తగ్గడంతో ఊబిలో చిక్కుకు పోయి మృతి చెందాడు. స్థానికుల సాయంతో ఊబిలో చిక్కుకున్న సంతోష్‌ను బయటకు తీశారు. అప్పటికే అతను మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం భీమిలి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన బస్సు : విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ప్రధాన రహదారిలో మంగళవారం స్కూల్ ఆటోను బస్సు ఢీకొనడంతో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. మింది గ్రామం నుంచి ఎవికె.స్కూలు, శ్రీ చైతన్య స్కూలుకు చెందిన విద్యార్థులను ఆటోడ్రైవర్ తీసుకెళుతున్నారు. పాత గాజువాక జాతీయ రహదారిలో సన్‌రైజ్ హాస్పిటల్ ఎదురుగా వచ్చేసరికి వెనుక నుంచి వచ్చిన బస్సు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. సిహెచ్.నివాస, సిహెచ్.భార్గవ్, సిహెచ్.భువన్‌దీప్, కె.సాహితీ, అభిరామ్‌కు గాయాలయ్యాయి. ఆటో ఉన్న మౌనికకు ఎలాంటి గాయమూ కాలేదు. గాయాలపాలైన విద్యార్థులను వెంటనే అక్కడే ఉన్న సన్‌రైజ్ హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ తిరుపతి ఆధ్వర్యాన సిబ్బంది వెంటనే వైద్యం అందించారు. స్వల్పగాయాలు కావడంతో అందరినీ ఇంటికి పంపించేశారు.

భారత రాజ్యాంగ మార్గదర్శకాలపై వర్క్‌షాప్

ప్రజాశక్తి- లీగల్ : ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబరేషన్ అసోసియేషన్ ఆధ్వర్యాన 'భారత రాజ్యాంగం మార్గదర్శకాలు' అంశంపై అల్లూరి సీతారామరాజు భవన్‌లో మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. సుప్రీంకోర్టు న్యాయవాది పొత్తూరు సురేష్‌కుమార్ మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించాలని ప్రాథమిక విధుల్లో నిబంధన (52 ఎ) ఉందని తెలిపారు. ఈ విషయాన్ని భారత పౌరులందరికీ తెలియజేయాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎప్పుడో ఉద్బోధించారని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ విధి అయినప్పటికీ ప్రభుత్వాలు ఉదాసీనంగానే వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు.

పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

డయాలసిస్ రోగికి పింఛన్ పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మారేడుబాక పంచాయతీ ఉర్లాకులపాడు గ్రామానికి చెందిన కోసూరి తమ్మారావుకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ మంజూరైంది. నిరుపేద గిరిజనుడైన తమ్మారావు కిడ్నీ వ్యాధితో భాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటూ లేవలేని స్థితిలో ఉన్నాడు. ఈయనకి మూడు నెలల క్రితం పింఛన్ మంజూరు కాగా అనివార్య కారణాలవల్ల పింఛను పంపిణీ చేయలేదు. ఈ మేరకు మంగళవారం మూడు నెలల పింఛన్ నెలకు రూ10వేలు చొప్పున రూ.30వేలు తమ్మారావుకు గ్రామ సర్పంచ్ తొంటా ఆదిరాజు, మాజీ జడ్పీటీసీ కోసూరి బుజ్జిచిన్నాలమ్మ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గణజాల తాతారావ్, కొచ్చా కాసులమ్మ, కోసూరి లోవవీరవెంకటరెడ్డి, వంచంగి సచివాలయ కార్యదర్శి సుమర్ల రాంబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. విద్యాశాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్, గిరిజన, పోలీస్, వైద్య శాఖ సహకారంతో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని స్ట్రైబ్, మినీ వైద్య శిబిరంతో పాటు పూర్తి స్థాయి వసతులు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఒకేషనల్ పరీక్షతో కలిపి విద్యార్థులు 8 పేపర్స్ రాసారని, ఆఖరి రోజు సోషల్ పరీక్షకు 276 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. మంగళవారం ఎపి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నతి పాఠశాల బాలుర పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీఓ విశ్వనాథ్ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ ఎం.శ్రీరాములు, డెవలప్మెంట్ ఆఫీసర్ బి.రాంబాబు, సిట్టింగ్ స్క్వాడ్ రత్నకుమారి, సీనియర్ సహాయకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి విద్యుత్ శాఖ పరిధిలో జడ్డంగి రూరల్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కిరణ్ కుమార్‌కు సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఆయన్ను మారేడుమిల్లి బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం రాజవొమ్మంగిలో ఆయన్ను విధులు నుండి రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇన్‌ఛార్జ్ ఏఇ కె.అబ్బాయిదొర, జెఇ పోలేశ్వరరావు, యల్ఐ డి.వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ మారుపూజ

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీపంలో ఉన్న నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో మారుపూజ ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముందుగా అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల ఆర్థిక సహాయంతో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ఉత్కల్ దివస్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఆల్ ఇండియా రేడియో స్టేషన్ సమీపంలోని ప్రాంగణంలో ఉత్కల్ దివస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్కల్ గౌరాబ్ మధుసుదాన్ దాస్, ఉత్కలనీ గోపాబాధి దాస్, కృష్ణ చంద్ర గజపతి మహారాజ్‌లకు తొలుత నివాళులు అర్పించారు. డాక్టర్ రాజేంద్ర కుమార్ ప్రధాన అతిథిగా, మనోజ్ కుమార్ సాహూ గౌరవ అతిథిగా హాజరయ్యారు.

కానరాని కందిపప్పు

మూడు నెలలుగా పంపిణీ చేయని ప్రభుత్వం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వం మారినా ప్రజా పంపిణీ వ్యవస్థ గాడిలో పడలేదు. పేదలకు ప్రతి నెలా ఇవ్వాల్సిన కందిపప్పును సరిగా ఇవ్వడంలేదు. ఒక నెల ఇస్తే రెండు, మూడు నెలలు పంపిణీ చేయని పరిస్థితి కొనసాగుతోంది. ఎండియు వాహనం దగ్గరకు సరుకుల కోసం వెళ్లిన పేదోళ్లకు ఎప్పుడు చూసినా కందిపప్పు రాలేదనే సమాధానమే వినిపిస్తోంది. జిల్లాలోని 5.37 లక్షల మంది తెల్లరేషన్ కార్డుదారులకు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు కందిపప్పు అందలేదు. ప్రతి నెలా కార్డుదారులందరికీ కిలో కందిపప్పు ఇవ్వాలంటే 537 మెట్రిక్ టన్నుల పప్పు అవసరం కానుంది. రాష్ట్ర స్థాయిలో టెండర్లు ఖరారు చేయక జిల్లాకు కందిపప్పు పంపించడం లేదు. కందిపప్పు పంపిణీ చేస్తే కార్డుదారులకు అందిస్తామని పౌరసరఫరాల శాఖాధికారులు చెబుతున్నారు. తెల్ల రేషన్‌కార్డుదారులకు కిలో కందిపప్పును రూ.67కు పౌరసరఫరాలశాఖ ఇస్తోంది. సరుకు రాలేదని ఫిబ్రవరి నుంచి లబ్ధిదారులకు ఇవ్వడంలేదు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.160 నుంచి రూ.170 ధర ఉండడంతో పేదలు కొనుక్కోలేకపోతున్నారు. బయట మార్కెట్‌లో అదనంగా దాదాపు వంద రూపాయలు పెట్టాల్సిరావడంతో కందిపప్పు వాడకం తగ్గించారు. కందిపప్పు పంపిణీలో గత ప్రభుత్వం నుంచి ఈ ప్రభుత్వం వరకు నిర్లక్ష్యం కొనసాగుతూనేవుంది. కొనుక్కొని తినే స్థోమతలేని పేదలకు ప్రతినెలా కందిపప్పు రాయితీపై పంపిణీ చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి లోపించింది. టెండర్లు ఆలస్యమైనకొద్దీ రాయితీ సొమ్ము ప్రభుత్వానికి ఆదాకావడంతో కందిపప్పు పంపిణీపై ఆసక్తి చూపడంలేదు.

పూర్ణా మార్కెట్ ఆశీలుపై దుమారం

నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు - పట్టించుకోని జివిఎంసి పాలకవర్గం
ఇన్‌ఛార్జి కమిషనర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగర నడిబొడ్డునగల ప్రధాన మార్కెట్ సర్దార్ వల్లభాయ్ పటేల్ (పూర్ణా మార్కెట్)లో జివిఎంసి నిబంధనల ఉల్లంఘనలకు హద్దేలేకుండా పోతోంది. వేలం పాటలో దక్కించుకున్న వారు ఒకవైపు, వేలం పాటతో నిమిత్తం లేకుండా ఆశీలు వసూలు చేసే వారు మరోవైపు రెండు పార్శ్వాలు నిత్యం ఇక్కడ ఉంటాయి. ఏదిఏమైనా అంతిమంగా జివిఎంసి ఆదాయానికి గండికొట్టడమే ఈ కాంట్రాక్టర్ల పనిగా ఉంది. జివిఎంసి కౌన్సిల్‌లో నిరంతరం ఈ వ్యవహారాలపై చర్చ సాగుతున్నా చర్చ చర్చే...దోపిడీ దోపిడీయే అన్నట్టు సాగుతూనే ఉంది. తాజాగా ఇలాంటి దుమారం మరొకటి రేగింది. ఆర్థిక సంవత్సరం అంతా ఒకరు, ఆ తర్వాత మరొకరు ఇలా పూర్ణామార్కెట్‌లో ఆశీల వసూలుకు కాంట్రాక్టు దక్కించుకుంటూ ఉంటారు. ముఖ్యంగా జివిఎంసి పాలకులు సైతం అధికారంలో ఎవరుంటే వారికి వత్తాసు పలుకుతూ.. రెవెన్యూ విభాగం వారు 'తిలాపాపం తలా పిడికెడు' అన్న చందంగా నిబంధనలను గాలికొదిలేయడం ఆనవాయితీగా మారిపోయింది. అధికార పార్టీకి చెందిన వ్యక్తి ఒకరు ఆశీల వసూలు కాంట్రాక్టు దక్కించుకున్నట్టుగా చెబుతూ ముందుకెళ్లడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. జివిఎంసి ఆర్డర్ కాపీ లేకుండా, స్టాండింగ్ కమిటీ అనుమతి లేకుండా, ఎలాంటి అధికారిక ప్రొసీడింగ్స్ లేకుండానే వసూళ్ల దందాకు దిగడం జివిఎంసి ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొట్టడమేనన్న విమర్శలు పూర్ణామార్కెట్ వ్యాపారులు, స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. జివిఎంసి పెట్టిన సూన్ బోర్డుల ప్రకారం కారుకు రూ.10 వసూలు చేయాల్సి ఉండగా సదరు కొత్తగా ప్రవేశించిన వ్యక్తి రూ.20 వసూలు చేయడం, చిరు వ్యాపారుల స్టాల్స్ వద్ద దందా సాగిస్తున్న వైనంపై స్వయంగా జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదులు వెళ్లాయి.

తాజాగా

ఏం జరుగుతోంది ?

2024-25 ఆర్థిక సంవత్సరానికి కాంట్రాక్టును వేలం పాటలో దక్కించుకున్న శ్రీరామమూర్తి అనే వ్యక్తి మంగళవారం జివిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తూ 8 నెలలకుగానూ తాను గత ఆర్థిక సంవత్సరంలో పూర్ణామార్కెట్ ఆశీలు వసూలు కాంట్రాక్టు పొందినట్లు పేర్కొన్నారు. అయితే చివర రెండు నెలలకుగానూ స్టాండింగ్ కమిటీ సంతకాలు లేనందున జివిఎంసి రెవెన్యూ అధికారులు తనను ఆపేశారని వెల్లడించారు. అయితే 2025-26 సంవత్సరానికిగానూ రూ.81 లక్షలకు బుచ్చ శ్రీను అనే వ్యక్తి ఆశీలు పాడారని, జివిఎంసి నుంచి ఎలాంటి ప్రొసీడింగ్ ఆర్డర్‌లూ దానికి లేవంటూ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే జివిఎంసి, రెవెన్యూ అధికారుల ఆదేశాల ప్రకారం చేస్తున్నానంటూ దౌర్జన్యానికి దిగుతున్నాడంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గ్యాంగ్ వేజ్ గంపలను తీయించేయడంతో పేద చిరు వ్యాపారులంతా ఇటీవల వరకూ ఆందోళన చేశారు. ఒక్కొక్కరి నుంచి తాను గతంలో రూ.10 (కారుకు కూడా) వసూలు చేస్తే తాజా కాంట్రాక్టరు అందరి నుంచీ అదనంగా రూ.10 అంటే రూ.20 వసూళ్ల ఎలా చేస్తాడంటూ ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ విషయమై చర్చ నడుస్తోంది.

పూత రాలిన జీడి మామిడి చెట్లు

అకాల వర్షాలతో రాలిన జీడి మామిడి పూత

ప్రజాశక్తి-కొయ్యూరు : జీడి మామిడి తోటల పూత దశలో ఆశాజనకంగా ఉండగా గత రెండు మూడు రోజుల్లో వడగళ్లతో కురిసిన వర్షాలు కురవడంతో జీడి మామిడి పూత పూర్తిగా రాలిపోయింది. మండలంలో సుమారు 4,500 హెక్టర్లు వరకు జీడి మామిడి తోటలు ఉన్నాయి. ఇతర పంటల కంటే జీడి మామిడి పంటపైనే అధికంగా రైతులు ఆధార పడుతున్నారు. సంవత్సరానికి ఒకసారి వచ్చిన జీడి మామిడి పంట సొమ్ముతో సంవత్సరం మొత్తం కుటుంబ పోషణ సాగుతుంది. ఈ పరిస్థితుల్లో మండలంలోని రేవళ్ల పంచాయితీ పరిసర గ్రామాలలో గత రెండు మూడు రోజులుగా కురిసిన వర్షాలు, వడగళ్లతో పూత, పిందే పూర్తిగా మాడిపోయి ఆకుల సైతం రాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం డిసెంబర్ నుండి జీడి మామిడి పూత ప్రారంభమై రైతులకు ఆశాజనకంగానే కనిపించిన, ప్రస్తుతం కాపు దశలో మాత్రం ఈ వర్షం నష్టాలు తీసుకొచ్చిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి నష్టాల్లో ఉన్న జీడి రైతులను గుర్తించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-విఆర్.పురం : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం... శ్రీరామగిరి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు నాల్లారపు సత్యనారాయణ రేకపల్లిలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్‌తో జరిగిన సమావేశానికి ద్విచక్ర వాహనంపై వచ్చారు. అనంతరం అధికారులతో పాటు ఆయన తన ద్విచక్ర వాహనంపై శ్రీరామగిరి వెళుతుండగా, ముద్దుల గూడెం గ్రామానికి సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం సత్యనారాయణ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనను చూసిన ఐటీడీఏ పీవో తన వాహనంలో బాధితుడిని ఎక్కించి హుటాహుటిన రేఖపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రేఖపల్లి వైద్యశాలలో డాక్టర్ అనీల్ కుమార్ రోగిని పరీక్షించి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం భద్రాచలం తరలించారు. సత్యనారాయణకు కుడికాలు మోకాలు పైన, మోకాలు కింద ఎముకలు విరిగినట్లు తెలుస్తోందని వైద్యులు తెలిపారు.

కెజిహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ ఓపీ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా సేవలందిస్తున్న కెజిహెచ్‌లో మంగళవారం నుంచి సాధారణ విభాగాలకు చెందిన ఓపీ సేవలతో పాటు సూపర్ స్పెషాలిటీ విభాగాలకు చెందిన ఓపీ సేవలనూ పూర్తిస్థాయిలో ప్రారంభించామని, వారంలో అన్ని రోజులూ రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఓపీ సేవలన్నీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకూ అందుతాయని, వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఇప్పటికే ట్రయల్ రన్ మూడు రోజుల పాటు నిర్వహించామన్నారు. న్యూరాలజీ, యురాలజీ ఎండోక్రైనాలజీ, కార్డియాలజీ, సిటివిఎస్, ప్లాస్టిక్ సర్జరీ, మెడికల్ అంకాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ ఓపీలు ప్రతి సోమవారం నుంచి శనివారం వరకూ ఉంటాయని, ఆదివారం సెలవుదినంగా ఉంటుందని అన్నారు. ఈ నూతన సేవలను ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రోగులంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రక్త పరీక్షలు, ఇతర స్కానింగ్‌లు, ఎక్స్‌రేలు సైతం సకాలంలో అందేలా తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.